# రచనాభ్యాసకుఠారం



"ఒరేయ్ కామేశం! బ్రహ్మాండమైన ప్లాట్ ఒకటి వచ్చిందిరా నా బుర్రలోకి" అన్నాడు చెట్టంత మనిషి రామేశం కొండంత ఉత్సాహంతో.

"అయితే, వెంటనే ఇల్లు కట్టేసేయ్" అన్నాడు కామేశం సీరియస్‌గా.

తనకి చెప్పమని కామేశం బలవంతం చేస్తాడని, తీరా చెప్పేస్తే తాను ఉపయోగించేసుకుంటాడేమోనని, చెప్పకపోతే ఇకపైన అప్పు కూడా పుట్టదేమో నని ఆలోచిస్తున్న రామేశానికి కామేశం జవాబు చిన్న బొప్పి కట్టినట్లనిపించింది.

"ఏడిశావ్ లేవోయ్! నువ్వే పెద్ద రచయిత వనుకోకు. మొత్తం పాతిక పంపితే పదమూడు ఉత్తరాలుమాత్రం వేసుకున్నారు ఆ పత్రికల వాళ్ళు. అది కూడా మా ఆవిడ పేర పంపావు కాబట్టి. మరీ పోజ్ కొట్టక ఆ ప్లాట్ చెప్పమని బ్రతిమాలు. అప్పు డాలోచిస్తాను— చెప్పాలో, వద్దో" అని కథ ప్లాట్ మొత్తం చెప్పేశాడు రామేశం.

"బాగానే ఉంది కానీ, ఏ అవకతవకలు లేకపోతే కథ మంచి దనిపించుకోదురా" అన్న కామేశం సలహాతో ఇద్దరూ కలిసి

అవకతవకలనే ఇద్దరు అభిప్రాయకుల్ని సృష్టించి కథలోకి చొప్పించేశారు.

ఇక కథ వ్రాయటం తరువాయి. రాజమండ్రీ పేపరు మిల్లుకి ఆర్డరిచ్చేశాడు ఉత్సాహవంతుడైన కామేశం. రామేశం దయాల్బాగ్ స్టోర్సుకి వెళ్ళి ఏకంగా రిక్షాలో పట్టించుకొచ్చేశాడు, నేనేం తక్కువ తిన్నానా అనిపించేట్లుగా.

ఓ సిద్ధాంతిగార్ని తీసుకువచ్చి వాస్తు రీత్యా తమ రూమ్ తమ తమ జాతకాలతో సరిపోయిందో, లేదో చూపించుకుని, అవసరమైన చిన్న చిన్న మార్పులు చేయించేసి లగ్నం పెట్టించేశారు. వీ రిద్దరి వరసా చూసి సిద్ధాంతి గారు కథ పూర్తయే లోపలే కొట్లాడుకుంటారేమోనని అభిప్రాయపడి కథను రామేశం ప్రారంభించటం మంచిదనీ, కామేశం పూర్తిచేస్తే మంచిదనీ ఎక్స్ట్రా ఛార్జీ చేయకుండానే ఓ సలహా ఇచ్చేశారు.

ముహూర్తం రోజు వచ్చేసింది.

"రామేశంగారూ! లగ్నం సమీపిస్తోంది. మీ రలా జాగుచేయడం భావ్యం కాదు. అవతల నాకు బోలెడు కార్యక్రమా లున్నాయి. చిట్టిబాబుగా రింట్లో ఓ పెద్ద కథ, దుండుభిగా రింట్లో ఓ నాటకం మొదలు పెట్టించాలి. వీళ్ళ చాదస్తంగానీ, ఈ పిల్లు రచయిత లున్నారు చూశారా — ఉత్తరాలు వ్రాయడానికి కూడా ముహూర్తాలూ, మీదుకట్టడాలూనూ. ఊపిరి సలప నివ్వటం లేదంటే నమ్మండి'' అన్నారు నరసింహం పంతులుగారు, ఆ ఊరికి తా నొక్కడే బ్రాహ్మణుడు కదా అనే గర్వంతో.

రామేశం కొబ్బరికాయ కొట్టి కథా రచన శాస్త్రోక్తంగా మొదలుపెట్టాడు. పంతులుగారు సెలవు తీసుకున్నారు.

"చూశావ్‌రా, రామేశం! ఈ పంతులు తానే లేకపోతే అసలు తెలుగు సాహిత్యమే లేదన్నట్టు మాట్లాడుతున్నాడు. ఈయన కాకపోతే మరొకరు. ఆయనా కాకపోతే వేరొకరు. అంతేకానీ, కథా రచన అనేది ఆగిపోదు కదా? వెనకటికి ఇలాంటాయనే అన్నాడుట— పది కిలోమీటర్ల లోపల బ్రాహ్మణు లెవరూ లేకపోతే ఓ నవల మొదలు పెట్టించేస్తానని!'' అన్నాడు కామేశం, తన చేత కథ ప్రారంభింప జేయలేదనే ఉక్రోషంతో.

"అన్నట్టు, రామేశం! మనం ఇద్దరం కలిసి ఈ కథని సాయం పట్టేస్తాం అనుకో. కానీ, ప్రచురణకి ఎవరి పేరున పంపుదాములా మరి?'' అన్నాడు మళ్ళీ కామేశం, మొదటి పేజి ఇంకా పూర్తి కానివ్వకుండానే.

"ప్లాట్ నాది. కనక నా పేరుతోనే పంపుతాము.''

"నీ ప్లాట్ కాకపోతే మరొకటి నా బుర్రలో మెరవక పోయేదా?''

"ఇంకో కథ కూడా వ్రాస్తే నీ పేరు ప్రతిష్ఠలకు ఏమీ నష్టం కల గదులే.'' ఛాలెంజీ చేశాడు రామేశం.

"తీక్ లేదనే అతి చిన్న కారణానికి కథా రచన ఆపెయ్యను కదా? ఓ పదేళ్ళ నాటి పత్రిక చూస్తే నాలుగో అయిదో దొరుకుతాయి రెడిమేడ్‌గా!'' కామేశం అంత పౌరుషంగానే జవాబిచ్చాడు.

"ఎలాగూ ఇద్దరం కలిసి కష్టపడుతున్నాము గనక మన పేర్లలో వచ్చే కామన్ పదాలని తీద్దాము'' అంటూ రాజీకి వచ్చేశాడు రామేశం.

"అంటే మేశం అని వస్తుంది. మనం ఏ గడ్డి మేశామో ఎవరికి కావాలి గానీ రాకాసిమేశం అని పేరు పెట్టుకుందాం మన జంట కలాలకి'' అని కామేశం అనగానే —

"మధ్యలో 'సి' అనే అక్షరం ఎందుకురా?'' అని ఎదురు ప్రశ్న వేశాడు రామేశం.

"అది సిద్ధాంతిగార్ని కూడా కలుపుదామని.'' జోటు తీర్చేశాడు కామేశం.

కథా రచన ముమ్మరంగా సాగిపోతూంది.

"అవి వెన్నెల రాత్రులు. సుమన గోదావరి ఒడ్డున నడుస్తూంది. చంద్రుని నీడ నీటిలో మరింత ప్రశాంతంగా మెరుస్తూంది. ఎండవేడికి ఇసుకలో నడుస్తున్న సుమనకి కాళ్ళు చుర్రుమంటున్నాయి.''

# తల్లాప్రగడ త్రినాధమూర్తి

"చంద్రుడు మెరవడ మేమిటి, మళ్ళీ ఎండ ఏమిటి? ఏది వ్రాసేసినా చెల్లిపోవటానికి నువ్వు ఏమన్నా పెద్ద పేరున్న రచయిత (త్రి) వా?'' అని రామేశాన్ని కోప్పడి, కామేశం రచనకు ఉపక్రమించాడు ఆఖరివాక్యం హస్తం కొట్టేసి.

"తనతోకూడా తన నీడ కదులుతున్నట్లనిపిస్తూంది సుమనకి. ఇంతలో పెద్ద సైరన్ లాటి హారన్ వినిపించింది. పిడుగులు పడుతున్న సుమన దానిలో సగంతు పొడుగున్న తన మెడను వెనక్కి తిప్పి చూసింది. అదొక పెద్ద ఓడ. చూస్తుంటే ఇండియన్ షిప్‌లాగ లేదు ...''

ఇలా సాగిపోతూండగా రామేశం నవ్వు వినిపించి చటుక్కున ఆగిపోయాడు కామేశం.

నవ్వు ఆపుకుంటూ, "నన్ను తప్పు పట్టావుకదా? మరి గోదావరిలోకి షిప్ ఎలా వచ్చిందిరా?'' అని రామేశం ప్రశ్నించే సరికి రచయిత కామేశానికి బుర్ర గోక్కోక తప్పలేదు.

కథకి ఏ పోటీలోనో ప్రైజ్ వచ్చేస్తే తాము ఇద్దరూ ఎలాగ పంచుకోవాలా అనే సందేహం వచ్చి వాగ్వివాదానికి తల పడ్డారు.

"పేవర్ల ఖర్చుతో చూస్తే ఇంకుకి అయినది ఎంత? అవుడు సమయానికి అప్పు పుట్టాలేకపోయినా, ఇంకు కూడా నేనే కొనేట్టును'' అని కామేశం తనకే ఎక్కువ రావాలి అని పట్టుపట్టాడు.


"మరి, సిద్ధాంతిగారి కన్సల్టేషన్ ఫీజు నేనేగా ఇచ్చింది?''

"ఆ రెండింటికీ చెల్లు. మరి ప్రారంభోత్సవం నాటి కొబ్బరికాయ నాదేగా?'' కామేశం మళ్ళీ ఆర్గ్యుమెంటుని పెంచేశాడు. కాస్సేపు ఆలోచించి రామేశం— "కానీ, ప్లాట్ నా ఒక్కడిదే కనక నాకే ఎక్కువ రావాలి'' అన్నాడు.

చివరకు ఇద్దరూ కూర్చుని, రచనను పక్కకు నెట్టి ఎవ రెవ రెంతెంత ఖర్చు చేసినదీ లెక్కలు చూసి ఒక రూపాయలో రామేశానికి ఏభయి అయిదు పైసలు, కామేశానికి నలభై అయిదు పైసల వాటాలు స్థిరం చేసుకున్నారు. వెనువెంటనే ఇంకో డౌటు వచ్చింది. తమ కథకు ప్రైజ్ వచ్చిన సందర్భంలో సన్మానాల వంటివి జరిగితే ఎవరు చేయించుకోవాలి అని. కామేశానికి ఒక మంచి పరిష్కారమార్గం దొరికింది— మొదటి ఆరు నెలల్లో జరిగినవి తాను, ఆ తరవాత ఆరు నెలల్లో జరిగినవి రామేశము చేయించుకుంటే బాగుంటుందని. పైగా వీటి గురించి మాటిమాటికి ఇద్దరూ ఆఫీసులో సెలవు తీసుకో నవసరము కూడా లేదని సంబరపడ్డారు. కామేశం తనకి ఊళ్ళో ఉన్న పలుకుబడి తలుచుకుని తనే ఎక్కువగా చేయించుకోవచ్చునని ఆలోచించుకుంటూ ఉండగా రామేశం కథా రచనకి ఉపక్రమించాడు.

"సుమన, శ్రీధర్ బజార్లో నడిచి వెళుతున్నారు. ప్రభాత్ టాకీస్‌కి వెళ్ళి టిక్కెట్లు తీసుకుని హాల్లోకి వెళ్ళారు.''

"అంత తొందరగా వారిని సినిమాకి పంపెయ్యకూడదురా. అనవసరమైనది వర్ణించటం వలన పుణ్యం, పురుషార్థం



నాగబంధం
ఫోటో—కె. వి. బ్రహ్మం ([illegible])

రెండూ కలిసి వస్తాయి'' అంటూ కామేశం తను వ్రాయడం మొదలు పెట్టాడు.

''సుమన ఏదో చెబుతూంది. శ్రీధర్ అదే వింటున్నాడు. సుమన రోడ్డుమీద నడిచే ఇతరు లెవరైనా కూడా వింటున్నారేమోనని చుట్టూ పరికించిచూస్తూంది. రోడ్డుపక్కన ఏదో పెయింటింగ్ వేస్తున్న పదేళ్ళ కుర్రవాణ్ణి చూడటంలో శ్రీధర్ నిమగ్నుడయ్యాడు. ఇద్దరూ మళ్ళీ నడుచుకుంటూ హోటల్లోకి వెళ్ళారు. కాఫీ తాగి బయటకు వచ్చి రిక్షా ఎక్కి సినిమా హాలు దగ్గర దిగారు.''


బ్రతుకుతెరువుతోకూడిన కామేశం ఈ తెలివితేటలకి రామేశం ఆశ్చర్య పోతూండగా—

''అప్పుడే అయిందా ... చూడు, వీళ్ళని ఇంకా ఒక పేజీ పూర్తయేవరకూ హోల్లోకి పంపను'' అంటూ కామేశం విజృంభించాడు.

''శ్రీధర్ పర్సు తీశాడు. వంద రూపాయల నోటు ఉన్న సంగతి చూసుకుని ఐదు రూపాయలనోటు బయటకు తీశాడు. రిక్షావాడు చిల్లర లేదనగానే సుమన హాండ్‌బాగ్ తీసి రూపాయనోటు ఇచ్చింది. రిక్షావాడు చిల్లర కోసం వెదుకుతుండగా 'పోనీలేహోయ్! పావలాయే కదా?' అని శ్రీధర్ బుకింగు వైపు నడిచాడు. సుమన తేలమొహం వేసింది. బుకింగు వద్ద పెద్ద క్యూ ఉంది. రష్‌గా ఉంది కనక ముందుగా డబ్బు బయటకు తీసి ఉంచుకుంటే మంచిదని సుమన చెప్పగానే శ్రీధర్ తన పాంటు పాకెట్‌లో చెయ్యి దూర్చాడు. మరుక్షణం ఖాళీ చెయ్యి బయటకు తీసి, 'ఓ మై గాడ్! మై పర్స్! మై పర్స్ విత్ మన్ వాట్ ఫైవ్ రుపీస్' అని గావుకేకలు పెట్టడం మొదలుపెట్టాడు. హడావుడిగా అటూ ఇటూ తిరిగేస్తున్నాడు. ఎదురుగా ఉన్న ఓ పెద్దమనిషి—'మీ షర్టు పాకెట్టులో ఉన్నట్లుందండీ' అని చెప్పగా ఆయన చెప్పినట్టు షర్టు జేబులోనే ఉంది ఆ పర్స్. శ్రీధర్ ఐదు నోటు లోపలకు తోసేసి వంద రూపాయల నోటు మాత్రం పైకితీసి, 'చిల్లర దొరుకుతుందో, లేదో' అంటూ గొణిగాడు. పాపం సుమనకి తన బాగ్‌లోనుంచి ఓ ఐదు నోటు తీసి ఇవ్వక తప్పలేదు. టిక్కెట్లు కొని చిల్లర జేబులో వేసుకుని శ్రీధర్ రాగానే ఇద్దరూ హోల్లోకి దారి తీశారు. . .''

''ఘటికుడివేనోయ్ నువ్వు!'' అంటు కామేశాన్ని మెచ్చుకున్నాడు రామేశం.

ఇలాగే కథ పూర్తి చేశామనిపించారు. కథలో ఎవ్వరూ చని పోకపోతే కథకి అంత మంచి పేరు రాదు అని అభిప్రాయపడి



బక ధ్యానం — ఫోటో—ఎస్. మల్లారెడ్డి (మద్రాసు—54)

ఇద్దరూ చెరొక కత్తిలాంటి కలాన్ని తీసుకుని తమకి నచ్చి ఉన్న వాళ్ళని ఇద్దర్ని చంపేశారు.

'అవసర కళ్యాణం' అని నామకరణం చేసి కథని ఫెయిర్ చేశారు. ఇక పోటీకి పంపటం తరవాయి. ఫస్టు ప్రైజు ఎక్కువగా ఉన్న పోటీని వెదికారు. పేరుకూడా ముఖ్యమే గనక ఎవరి సర్క్యులేషన్ ఎక్కువో చూశారు.

'ప్రతిభ' వీక్లీ సబ్‌ఎడిటరు తమ దూరపు బంధువని, అవసరమైతే సహాయం చేస్తాడని ఆ పోటీకి పంపుదామన్నాడు రామేశం.

''పేరు ప్రతిష్ఠలు మనిషిని ఎంత పని అయినా చేయిస్తాయి. పేర్లు మార్చేసి మన కథకే ఆయన ప్రైజు గెలుచుకుని ఆప్రోజినను నాయకులలాగ తప్పు అంతా ఇందిరాగాంధికి తోసేశాడంటే మన మేమీ చెయ్యలేము. కనక అన్ని విధాలుగానూ వీలుగా ఉంది. 'విజయఢంకా' పోటీకే పంపుదాం'' అన్నాడు కామేశం.

ఆ విధంగా తమ 'అవసర కళ్యాణం' కథను 'విజయఢంకా' వారి కథలపోటీకి పంపారు.

'ఈ రామేశం పెద్ద వాటా తీసేసుకున్నాడు. పేరు ప్రఖ్యాతులు వ్యాపించి సన్మానాలు చేస్తామని ప్రజలు వచ్చేవరికి వాడి టర్న్ వచ్చేస్తుంది, రెండు విషయాల్లోకూడా తనకి నష్టమే'నని మధనపడి, కామేశం ఒక ఐడియా వేశాడు. దాని ప్రకారం అదే సీజనులో 'ఆంధ్రమాత' అనే పత్రిక వారు నిర్వహిస్తున్న పోటీకి 'అవసర కళ్యాణం' కథనే లోపలి పేర్లు అన్ని మార్చేసి పంపి తన మనస్సుని శాంత పరుచుకున్నాడు.

దీపావళి పండుగ వచ్చింది. స్పెషలు సంచికలుకూడా వచ్చేశాయి. 'విజయఢంకా' స్పెషలు కాపీ చూడగానే వారిద్దరి ఆనందానికి అవధులు లేవు. అంటే అసలు ఆనందం లేదు అని కాదు. ఆనందం ఎంత దూరం వ్యాపించేసిందో తెలియదు అని దాని అర్థం. వారి కథకి అయిదు వందల రూపాయల ఫస్టు ప్రైజు వచ్చింది. పోటీలు పడి ఎదురైన ప్రతి మనిషి హాండ్సు షేక్ చేసేస్తున్నారు ఇద్దరూ.

ఏదో సాకుతో కామేశం వెనక్కి పరుగెత్తి, 'ఆంధ్రమాత' చూశాడు. ఆశ్చర్యం. దానిలో తన స్వంత కథకి సెకండు ప్రైజు వచ్చింది. రామేశాన్ని జయించినట్లు ఫీలయి 'ఇది చూపిస్తాను. హడిలి డంగ్ అయిపోతాడు' అని ఆలోచించుకుంటూ రూమ్‌కి పరుగెత్తాడు.

రామేశంకూడా విడిగా అదే కథని 'అనవసర కళ్యాణం' అనే పేరుతో తన బంధువు ద్వారా 'ప్రతిభ' పోటీకి పంపాడు. దానికికూడా సెకండు ప్రైజు వచ్చిందని పాపం, కామేశం ఆలోచనా పరిధిలోకి రాలేదు.

విమర్శకులు రంగంలోనికి దూకారు.

''కథ ఎంత బాగుంటే మాత్రం కాపీకథకు ఫస్టు ప్రైజు ఇవ్వటం అన్యాయం. కావలిస్తే 'ఆంధ్రమాత' దీపావళి సంచిక చూడండి. టైటిల్ కూడా ఇదే'' అని ఒకరు 'విజయఢంకా' వారి మీద విరుచుకు పడ్డారు.

పోటీలో పాల్గొని కృతజ్ఞతలు మాత్రం స్వీకరించిన ఒక రచయిత— ''మీరు సెకండు ప్రైజు ఇచ్చిన కథ 'అవసర కళ్యాణం'— 'విజయఢంకా' వారి పోటీలో ఫస్టు ప్రైజు గెలుచుకున్న కథకి మక్కీకి మక్కీ. దాని ట్రూకాపీ ఎవరు ఆపెన్ను చేశారో తెలియజేయ ప్రార్థితులు'' అని జోకులతో సహా ఏకేశారు 'ఆంధ్రమాత' పత్రిక వారిని.

ఇదే విధంగా ప్రతిభ ఎడిటర్‌ని—''మీ పోటీలో సెకండు ప్రైజు వచ్చిన 'అనవసర కళ్యాణం' అనే కథ 'ఆంధ్రమాత' పోటీలో బహుమతి గెలుచుకున్న 'అవసర కళ్యాణం' కథతో ఏకీభవించినదని నేను, మీ కథ 'విజయఢంకా' వారి పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్న కథతో ఏకీభవించినదని నా స్నేహితుడు వాదించుకున్నాము.

సందేహనివృత్తి కొరకు మూడు పత్రికలు కొనబుద్ధినని వెదకగా ఆ కాపీలన్నిటినీ ఎవరో టోకుగా ఖరీదు చేసుకు వెళ్ళారని తెలిసింది. కావున మీరు మాతో ఎవరితో ఏకీభవిస్తారో వెంటనే ప్రకటించ ప్రార్థన'' అని ఒక పాఠకుడు అర్థించాడు.

మనీఆర్డరు(ల) కోసం ఎదురు చూస్తున్న రచయిత లిద్దరికీ ఈ విషయాలేమీ వినిపించలేదు, కనుపించ లేదు.

కొద్ది రోజులకి ఒక రిజిస్టర్డు లెటరు వచ్చింది.

''పూజ్యులైన రామేశం, కామేశం, రాకాసిమేశంగార్లకు—

రామేశంగారిచే పంపబడి 'ప్రతిభ' దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి గెలుచుకున్న 'అనవసర కళ్యాణం' కథ, 'ఆంధ్రమాత'వారి పోటీలో అదే బహుమతి గెలుచుకున్న కామేశంగారి 'అవసర కళ్యాణం' కథ, రాకాసిమేశంగార్లచే రచించబడి 'విజయఢంకా' వారి కథల పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్న 'అవసర కళ్యాణం' కథ—ఈ మూడు కథలు ఒక్కటేనని ఋజువయినది.

మీరు చేసిన ఈ పనికి మేము చాలా తీవ్ర విమర్శలకు గురి కావలసి వచ్చినది. లేదా అభిప్రాయములతో చివరకు కోర్టుకు కూడా వెళ్ళక తప్పలేదు. దీనికి బాధ్యులు మీరే గనక మా మూడు పత్రికలు భరించవలసి వచ్చిన కోర్టు ఖర్చులు రు. 500 (అక్షరాల అయిదు వందల రూపాయలు) వెంటనే పంపగలరు.

ఇవియే అనేక రిజిస్టర్డు నోటీసులు,

భవదీయులు

ఎడిటర్—'విజయఢంకా',

ఎడిటర్—'ఆంధ్రమాత',

ఎడిటర్—'ప్రతిభ'.

గమనిక: మీరు గెలుచుకున్న బహుమతులు రద్దు చేయడమైనది.''

ఉత్తరం చదవటం పూర్తి చేసి, ''మన్ కూడా పంపావురా?'' అన్నారు ఇద్దరూ ఒకేసారి.

''ఏదో వాటా వేసుకున్నాము కదా? నీ వాటా రెండు వందల పాతికవర్తి వేయ్. మిగిలినది నేను నేను వారికి వెంటనే పంపించేస్తాను'' అంటూ విచ్చుర్చాడు రామేశం.